క్లుప్తంగా

ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



ములకలపల్లి: మండలకేంద్రం లోని ఓవర్ హెడ్ ట్యాంక్ పైకి ఎక్కేందుకు ఎట్టకేలకు నూతనంగా ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. మండలకేంద్రానికి తాగునీరందించేందుకు నిర్మించిన ఈ ట్యాంకు మెట్లు శిథిలావస్థకు చేరి, పటుచోట్ల విరిగిపోగా ఈ సమస్యలపై సాక్షిలో ప్రచురితమైన 'మెట్లు లేక ఇక్కట్లు' కథనానికి అధికారులు స్పందించి మెట్లు ఏర్పాటుచేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఉచిత ప్రమాద బీమా

మణుగూరు టౌన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి వారి సంక్షేమానికి రూ.30 లక్షల ఉచిత ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింజేయనున్నట్టు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. శుక్రవారం జీఎం సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై ఏరియా ప్రిన్సిపాల్ ఎంప్లాయర్స్ సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డీడీ పి.మణెమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి.రాజు, రాష్ట్ర కౌన్సిలర్ బి.ప్రసాద్ రావులు మాట్లాడుతూ... సీనియారిటీ లిస్ట్‌లో పుట్టినరోజు ప్రకారం లిస్ట్ తయారు చేయడం వలన లోపాలు తలెత్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్, రవి, విజయ, శ్రీవాణి, దేవేందర్, లలిత, శివ, కృష్ణ, శ్రీను, రజిత పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బూర్గంపాడు: పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులతో పాటుగా గతంలో బీమా ఉన్న రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలని, ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలకు తమ ఆధార్, నామిని ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లను అందించాలని పేర్కొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు మరో అవకాశం

భద్రాచలంటౌన్: అటానమస్ హోదా సాధించిన భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్ పొందుటకు మరొక అవకాశం కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కె.జాన్ మిల్టన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పేజీలో విద్యార్థులు ఆగస్టు 2 వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వేరే కళాశాలలో చేరి ఉంటే పాత కళాశాల అడ్మిషన్లు రద్దు చేసుకుని చేరాల్సి ఉంటుందని తెలిపారు. కళాశాల సీబీసీఎస్ విద్యా విధానంలో బీఏ, బీకాం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ కోర్సులలో బకెట్ సిస్టం ద్వారా అనేక సబ్జెక్టులకు అవకాశం ఉందని వివరించారు. కళాశాలలో సహాయ కేంద్రం ద్వారా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసువచ్చని సూచించారు.

కాల్వ గండ్లు పూడ్చాలి

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ కాలువ గండ్లు పూడ్చాలని పలువురు ఆయకట్టు రైతులు కోరారు. గురువారం కాల్వ గండ్లను పరిశీలించి వారు మాట్లాడుతూ.. కుడి, ఎడమ కాల్వలు పలుచోట్ల కోతకు గురై గండ్లు పడ్డాయని, దీంతో నీరంతా వృథాగా బయటకి పోతోందని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. రైతులు మెచ్చా వెంకన్న, పైదా కోటేశ్, మెచ్చా రాజులు, కాకా అబ్బాస్, సోడే రాజులు, కీసరి రాములు, కుంజా పెద్దరాముడు తదితరులు ఉన్నారు.

వరదలపై అవగాహన

దుమ్ముగూడెం: గోదావరి పెరుగుతున్నందున ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం శుక్రవారం అవగాహన కల్పించారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అవగహన కార్యక్రమంలో కమాండర్ భూపతి రావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మణిదర్, ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, ఆర్ఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. భయానకం..

మణుగూరు-ఏటూరునాగారం రోడ్డుపై అతివేగంగా బొగ్గు లారీల రాకపోకలు

- రాత్రి వేళల్లో మరింత మితిమీరిన వేగం
- రోడ్డుపైకి రావాలంటే వణుకుతున్న వాహనదారులు
- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు



పవర్ ప్లాంట్ ఎదురుగా నిలిపిన బొగ్గు లారీలు



రామానుజారం సమీపాన లారీ-కారు ఢీకొన్న ఘటన (ఫైల్)

పినపాక: మణుగూరు- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు వణుకుతున్నారు. రాత్రివేళ అయితే ప్రయాణం చేయకుంటేనే మంచిది అన్న చందంగా తయారైంది ఆ రోడ్డు పరిస్థితి. పినపాక, మణుగూరు మండలాల మధ్యలో ఉన్న భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు మణుగూరు నుంచి బొగ్గు తరలిస్తున్నారు. ఈ నేపథ్యాన మణుగూరు - ఏటూరునాగారం ప్రధాన రహదారిలో కాలం చెల్లిన లారీలు అధిక లోడ్, వేగంతో మణుగూరు నుంచి బొగ్గు తరలిస్తున్నాయి. నిత్యం ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే ఈ బొగ్గు లారీల ద్వారా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో రహదారిపైకి రావాలంటేనే ప్రయాణికులు వెళ్లాలంటే హడలిపోతున్నారు. రాత్రి వేళ మితిమీరిన వేగంతో రోడ్లపై వెళ్తుంటే వాహనదారులు మణుగూరు వెళ్లాలన్నా, అటు నుండి రావాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని అధికారులు

లారీలు అతివేగంతో వెళ్తున్నా, నిత్యం ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, బీటీపీఎస్ సెక్యూరిటీ అధికారులు నిమ్మకు నీరుతున్నట్టు వ్యవహరించడం శోచనీయం. మణుగూరు నుంచి ప్రతీరోజు 100 నుండి 150 వరకు లారీలు బొగ్గు తరలిస్తున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో బీటీపీఎస్ ఎదురు రోడ్డు మీదనే లారీలు ఆపడం వలన ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఎదురుగా వస్తున్న వాహనాలు రోడ్డు దిగి భయానిక పరిస్థితుల్లో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్న అధికారులు ధ్రువపత్రాలు కానీ, వాహన తనిఖీలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రాత్రి వేళ వెళ్లాలంటే భయం

మాది బయ్యారం రాత్రి వేళలో కిరాయికు మణుగూరు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. నిత్యం పదుల సంఖ్యలో బొగ్గు లారీలు మితిమీరిన వేగంతో వెళ్తుంటే ఎప్పుడు ఏం జరుగుతుందన్న భయం కలగడం వలన కిరాయిలకు వెళ్లాలంటే వెనకడుగు వేస్తున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– వెంకట్‌రెడ్డి, బొలేరో డ్రైవర్, బయ్యారం

పశువులను పోగొట్టుకుంటున్నాం

రాత్రి వేళల్లో పాడి గేదెలను బయటకు వదలాలంటే భయానక పరిస్థితి. ఇటీవలే నాలుగు పాడి గేదెలు అర్ధరాత్రి సమయంలో బయటకు వెళ్తే గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాయి. రాత్రి సమయంలో బొగ్గు లారీల సంఖ్య తగ్గించి రోడ్లపై పలు సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– జయలక్ష్మి, ఉప్పాక

మూగజీవాలు సైతం బలి



మృతి చెందిన గేదెలు (ఫైల్)

వాహనాల అతి వేగానికి మనుషులు మాత్రమే కాకుండా మూగజీవాలు కూడా బలవుతున్నాయి. ఇటీవల సాంబయ్య గూడెం పవర్ ప్లాంట్ సమీపంలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నాలుగు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రామానుజరం గ్రామ శివారులో లారీ ఢీకొని ఒక పాడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. అర్ధరాత్రి వేళలో బొగ్గు లారీలు అతివేగం వలన పశువులు మతి చెందుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారుల స్పందించి తగు చర్యలు తీసుకోపోవడంపై బీటీపీఎస్ పరిసర గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

గుండాల: పట్టణ కేంద్రాల నుంచి కొనుగోలు చేసుకున్న సరుకులను అతి తక్కువ ధరలతో, వేగంగా గమ్యానికి చేరే లాజిస్టిక్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం, మణుగూరు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.హనుమంతు, కె.ఉపేందర్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ కౌంటర్‌ను మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సర్వీస్ ఉదయం 7 నుంచి రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, కార్గో, పార్సిల్ కొరియర్ సర్వీసులను పూర్తిగా ఆన్‌లైన్ చేశామన్నారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల వెంకన్న, మానాల ప్రభాకర్, గొరిశెట్టి సత్యం, టి.రాము, సత్యం, రాములు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీగా ప్రదీప్‌కుమార్ బాధ్యతలు



అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఏరియా పశు సంవర్ధక శాఖ ఏడీగా ప్రదీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు సత్తుపల్లి బదిలీ కాగా, ఆయన స్థానంలో సత్తుపల్లిలో ప్రదీప్ కుమార్ అశ్వారావుపేటకు వచ్చారు. ఈ మేరకు స్థానిక ఏరియా హాస్పిటల్‌లో విధుల్లో చేరగా, స్థానిక సిబ్బంది ఆయన కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

కరకగూడెం: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని జెడ్పీటీసీ కొమరం కాంతారావు అన్నారు. మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి వంటశాలలను తనిఖీ చేశారు. హెచ్ఎం జగన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరవొద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ స్వప్న

అశ్వాపురం: సైనికుల త్యాగాలు మరవొద్దని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న ఆకోజు అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ దివాస్ నిర్వహించారు. ఏఓ బీ.కృష్ణ, ఎన్‌సీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్ కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రాంబాబు, రమ, గ్రీష్మ ఉన్నారు.

బడ్జెట్‌పై ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం సారపాక ప్రధానకూడలిలో ఆందోళన చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, సరోజని, అబీదా, రాము, కనకం వెంకటేశ్వర్లు, చంద్రరావు, కమటం మరియమ్మ, ఏడుకొండలు, వెంకమ్మ, నాగమణి పాల్గొన్నారు.

గోపాలమిత్రలను ఆదుకోవాలి

బూర్గంపాడు: ఏళ్ల తరబడి అతితక్కువ వేతనాలతో పనిచేస్తూ మూగజీవాలకు సేవలందిస్తున్న తమను ఆదుకోవాలని గోపాలమిత్ర జిల్లా ఆర్గనైజర్ తాతిరెడ్డి గోవిందరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. నెలకు రూ.11వేల జీతంతో 24గంటల పాటు పనిచేస్తున్న తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈమేరకు ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

అధికారులకు వినతులు

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా ఏజన్సీ న్యాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ సొందె వీరయ్య మాట్లాడుతూ... మన్యంలోని గోండ్వానా విద్యార్థులకు భద్రాచలంలో కనీసం ఐదు సెంట్లు భూమి కేటాయించాలన్నారు. మండలంలోని దేవరపల్లి గ్రామంలోని అర్హులైన ఆదివాసీలకు పోడు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, ముక్తి జనార్దన్ రావు, సున్నం సుబ్బయ్య, పాయం సన్యాసి, కారం లక్ష్మి, కారం సుధ, పొడియం ఆదెమ్మ, పొడియం రామక్క పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మణుగూరు టౌన్: ఓసీ-2 కొత్త సైట్ ఆఫీస్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వర్క్‌షాప్ కార్మికులు శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ద్విచక్రవాహనాల పార్కింగ్ షెడ్ పక్కన మ్యాన్‌వే ఏర్పాటు, సిమెంట్ కాంక్రీట్ రోడ్డు, పాత డంపర్ సెక్షన్‌లో ఏర్పాటు చేసినట్లుగానే కొత్త ప్రాజెక్ట్ వర్క్‌షాప్ ఆవరణలో క్యాంటిన్, విశ్రాంతి భవనం ఏర్పాటు, ఆర్ఓ ప్లాంట్ తదితర సమస్యలపై వివరించారు. ఈశ్వర్, అబ్దుల్ రవూఫ్, వెంకటరత్నం, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, భద్రయ్య, వీర్యా, సంజీవ్ విల్సన్ రాజ్, హేమరాజ్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు..

మణుగూరు రూరల్: మున్సిపాలిటీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపల్ కమీషనర్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘం సభ్యులు సురేందర్ పటేల్, అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, యుగేందర్ ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పినపాక: పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అధికారులు, సిబ్బంది కలియతిరుగుతూ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పారబోయించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాల: ఆళ్లపల్లిలో..



కరకగూడెంలో..

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆదినారాయణ



చంద్రుగొండ: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి/ చంద్రుగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని, ప్రజలకు ఇచ్చిన మాట తప్పేది లేదని ఆ దిశగానే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్టు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. తిప్పనపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నపురెడ్డి పల్లిలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, వేమల రమణ, లక్ష్మారెడ్డి, రాము, వేముల నరేష్, వెంకట్రామిరెడ్డి, లాలయ్య, కల్లోజి నర్సింహారావు, బోడా పద్మ, చంద్రుగొండలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, ఎంపీపీ బాణోత్ పార్వతి, నాయకులు భోజ్యానాయక్, ఉప్పతల ఏడుకొండలు, ఎస్డీ రసూల్, దారం గోవిందరెడ్డి, బొర్రా సురేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరు రూరల్ : ప్రతీ ఒక్కరికి కొత్త చట్టాలపై అవగాహన ఉండాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి సూచించారు. మండలంలోని గుట్టమల్లారం పంచాయతీలోని రైతువేదికలో శుక్రవారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి హాజరై ప్రజలకు కొత్త నేర చట్టాలపై అవగాహన కల్పించారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రజాభద్రత కోసం ఎన్నో చట్టాలను రూపొందించిందన్నారు. నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు ఉండి ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సులో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ర రవికుమార్, వ్యవసాయశాఖ ఏడీఏ తాతారావు, ఏఓ రామశివరావు, న్యాయవాదులు సర్వేశ్వరరావు, కూర్మా విజయ్‌రావు, పోశం భాస్కర్, రుద్ర నాగరాజు, రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

భద్రాచలంఅర్బన్: అధిక వర్షాలు గోదావరి వరదల నేపథ్యంలో వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. వరదబాధిత గ్రామాల్లో జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ నెలలో ఈడీడీ లిస్టులో ఉన్న గర్భిణులను దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆస్పత్రి, మాతా శిశుసంరక్షణ కేంద్రాల్లో ఉంచాలన్నారు. ఐరిస్ గర్భిణులను గుర్తించి వారిని ఆసుపత్రిలో ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసి, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో వీసల కృష్ణ, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

చర్ల: ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్లాలని సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీలో విష జ్వరాలు ప్రభలుతూ జనం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీ గ్రామంలో దోమలమందును పిచికారీ చేయించాలని, ఫాగింగ్ చేయించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో నాయకులు కారం నరేష్, బాలాజీ, చంటి పాల్గొన్నారు.

విత‌రణ



దమ్మపేట: నోట్ పుస్తకాలతో విద్యార్థులు

దమ్మపేట: మండలంలోని గణేష్‌పాడు, సీతారాంపురం, గుండెపట్వారిగూడెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, కంపాక్స్ బాక్సులను, ట్రస్ట్ ఫౌండర్, ఆయుర్వేద వైద్యురాలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాథమిక దశలోనే విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

ఫ్యాన్లు, లైట్లు..

మణుగూరు రూరల్ : పట్టణంలోని మండల మున్నూరుకాపు సంఘ కార్యాలయానికి కొత్తగూడెం సంఘ నాయకులు మొగిలిశెట్టి సత్యనారాయణ ఫ్యాన్లు, పుప్పాల వినీల్ ఎల్ఈడీ లైట్లను వితరణగా అందజేశారు. సంఘ మండల కార్యదర్శి గాండ్ల సురేష్, ఏనుగుల శ్రీనివాస్, మిరియాల భాస్కర్, అమూల్ శ్రీనివాస్, పులిశెట్టి బాబు, కలవాల వెంకట్, మొగిలిశెట్టి నరసింహరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కరకగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రేగా కాళికా అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... మండలంలో సర్పంచులు లేనందున ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ఉన్న సమస్యలను అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీ కొమరం కాంతారావు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ శైలజలను సన్మానించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగప్రసాద్, ఏఈ నరేందర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవ వరకుమార్, వైద్యాధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

మణుగూరు రూరల్ : గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా మణుగూరు డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామపంచాయతీలను సందర్శించి ఆయన మాట్లాడుతూ.. నిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, ట్రాక్టర్లకు కిస్తీలు కట్టలేక, మల్టీపర్పస్, స్కావెంజర్లకు నెలవారీ జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారిణి స్పందన పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ స్పందన



అశ్వారావుపేటరూరల్: పరీక్షలు చేస్తున్న వైద్యులు



చర్ల రూరల్: లింగాపురంపాడు గ్రామంలో..



దుమ్ముగూడెం: కే.రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం